
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

ఆదివారం 9 జూన్ 2024



నాడు-నేడు నొక్కుడు



గుంటూరు ఎస్టీవోకాలనీ ఎస్‌కేబీపీఎం స్కూల్‌లో నిర్మాణ దశలోనే గదులు

- తల్లిదండ్రుల కమిటీ పేరుతో వైసీపీ నేతలే పనులు
- అరకొర సాగిన పనులు.. యథేచ్ఛగా బిల్లులు చెల్లింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.600 కోట్లకుపైగా వ్యయం
- ఐదేళ్లు గడుస్తున్నా పాఠశాలల్లో కొలిక్కిరాని పనులు
- మొదటి దశలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు మూలకు
- పనులపై విచారణకు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్

గుంటూరు(విద్య), జూన్ 8: విద్యావ్యవస్థలో సంస్కరణలు పేదలకు కూడా కార్పొరేట్ తరహా విద్య అంటూ వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. నాడు నేడు పేరుతో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేకలు మారుస్తామని, విద్యార్థులకు అత్యాధునిక వసతులు, సమగ్ర సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించింది. నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున పనులు చేపట్టింది. ఆయా పనులను పాఠశాలల వారీగా గుర్తించి తల్లిదండ్రుల కమిటీలతో చేయించాలే వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే తల్లిదండ్రుల కమిటీల ముసుగులో వైసీపీ నాయకులు చాలా దగ్గర్ల ఆయా పనులను దక్కించుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాడు నేడు తొలి దశలో 1149 పాఠశాలలను ఎంపిక చేసి దాదాపు రూ.325 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు సమాచారం. రెండో దశలో 1344 పాఠశాలలను ఎంపిక చేసి మరో 340 కోట్లు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టారు. అయితే రంగులేసి.. తూతూ మంత్రపు పనులతో మమ అనిపించి రూ.లక్షల్లో జేబుల్లో వేసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. అయితే ప్రభుత్వం వారిదే కావడం.. ఇష్టారీతిన పనులు చేసినా అటు ఉపాధ్యాయులు, ఇటు అధికారులు ప్రశ్నించలేకపోయారు. నాణ్యతా లోపంతో ఆయా పనులు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చినా ఇంతకాలం ఎవరూ నోరుమెదపలేదు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌళిక వసతుల కల్పనే లక్ష్యంగా సాగిన పనులు ఐదేళ్లు కావస్తున్నా కొలిక్కిరాలేదు. శిథిలమైన పాఠశాలలను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామనే ముసుగుతో తల్లిదండ్రుల కమిటీల మాటును చేసిన పనులతో వైసీపీ నాయకులు పెద్దఎత్తున దోచుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచి ఉన్నాయి. తాగునీరు, టాయిలెట్, ఫర్నీచర్, కాంపౌండ్ వాల్, రంగులు, మరమ్మతులు, ఫ్యాన్లు, లైట్లు, వంటగది, ఇంగ్లీష మీడియం ల్యాబ్‌ల ఏర్పాటు పేరుతో పెద్ద మొత్తంలో కమీషన్లు దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు సహా పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాల నుంచి మారుమూల గ్రామాల్లోని పాఠశాలల వరకు సక్రమంగా పనులు చేయలేదు. కార్పొరేట్ కట్టడాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది విద్యా వికాసానికి బాటలు వేస్తున్నామని నమ్మించిన వారు పనులను మాత్రం పూర్తిచేయలేదు.



నల్లపాడులోని జడ్పీ స్కూల్‌లో వాటర్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన కూలర్

నిర్మాణ దశలోనే పనులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాడు నేడు పనులు 2021లో ప్రారంభించారు. దాదాపు ఐదేళ్లు పూర్తి కావస్తున్నా పనులు ఇంకా పూర్తికాలేదు. గుంటూరులోనే అనేక పాఠశాలల్లో నిర్మాణ పనులు వెక్కిరిస్తున్నాయి. ప్రతి దగ్గర వైసీపీ వారే ఆయా పనులు చేపట్టారు. అనేక చోట్ల పనుల్లో నాణ్యత లోపం కనిస్తున్నా బిల్లులు చెల్లింపు మాత్రం యథేచ్ఛగా సాగింది. మొదటి విడతలో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు ఇప్పడు దాదాపు మూత పడ్డాయి. కాంట్రాక్టు ఏజన్సీ ఐదేళ్లపాటు మరమ్మతులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖాలాలు లేవు. రెండో దశలో కూడా సంవత్సరం క్రితం అనేక పాఠశాలలకు వాటర్ ప్లాంట్లు వచ్చాయి. వీటిని ఇంత వరకు వినియోగం లోకి తీసుకురాలేదు. పనుల పర్యవేక్షణను విద్యాశాఖ అధికారులు అసలు పట్టించుకోలేదు. పనుల పురోగతిని యాప్‌లో నమోదు చేయమని ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో నాణ్యత, పనుల వేగం గురించి ప్రశ్నించిన దాఖలాలు లేవు. దీంతో నాడు నేడు పనులు ఇష్టారాజ్యంగా సాగాయి. కొంతమంది అధికారులు ఇందుకు ఇతోధికంగా సహకారం అందించి బిల్లుల మంజూరులో భారీ స్థాయిలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో నాడు నేడు పనులు చేసే కాంట్రాక్టర్లను బెదిరించి నరసరావుపేటలో విద్యాశాఖ కార్యాలయం నిర్మాణం కోసం అప్పటి ఇన్‌చార్జి డీఈవో మేకతోటి వెంకటప్పయ్య నిధులు వసూలు చేసిన విషయం బహిర్గతమైన విషయం తెలిసిందే. ఇలా నాడు నేడు పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని అటు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చెత్తపన్నుకు.. చెక్



- పట్టణ వాసులకు శుభవార్త
- వసూలు నిలిపివేయాలని ఆదేశాలు
- వైసీపీ హయాంలో రూ.9.48 కోట్లు వసూలు
- ప్రజలపై ఆర్థిక భారాన్ని తొలగించిన కూటమి ప్రభుత్వం

సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకుంటూ పాలన సాగించిన వైసీపీ పాలకులు ప్రజలను అందినకాడికి పిండేశారు. పన్నులు, చార్జీలు, ధరలతో విపరీతంగా దోచేశారు. పన్నుల్లో ప్రధానంగా చెత్త పన్ను ఒకటి. ఎక్కడా లేని విధంగా.. ఎప్పుడూ చూడని విధంగా.. ఏ ప్రభుత్వం చేయనట్లుగా.. చెత్త పన్ను వసూలు చేసి ముఖ్యమంత్రిగా జగన్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. చెత్త ప్రభుత్వం.. చెత్త ముఖ్యమంత్రి అన్న విమర్శలు కూడా వచ్చాయి. చెత్తపన్నుపై ప్రజలతో పాటు ప్రతిపక్షాలు ఆందోళనలు చేశాయి. అయినా వెనక్కి తగ్గని జగన్ ప్రభుత్వం మున్సిపాల్టీ ప్రాంతాల్లోని ఇళ్ల నుంచి చెత్త పన్నును ప్రత్యేకంగా వసూలు చేసింది. రోజుకు రూ.2 నుంచి 4వరకు ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ పేరుతో వసూలు చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పుర ప్రజల ముక్కు పిండి మరీ రూ.9.48 కోట్లు వసూలు చేశారు. చెత్త పన్ను వసూలు బాధ్యతలను సచివాలయాలకు, వారు వలంటీర్లకు లక్ష్యాలు విధించి మరీ అప్పగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రానున్న నేపథ్యంలో తాజాగా చెత్త పన్ను వసూళ్లను ఆపేశారు. దీంతో పట్టణాల్లో ప్రజలు చెత్త పన్ను నుంచి తప్పించుకున్నారు.

(గుంటూరు, నరసరావుపేట ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ పన్నుల బాదుడు నుంచి కుటమి ప్రభుత్వం ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు సిద్ధమైంది. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లుగా చెత్త పన్నుకు చెక్ చెప్తూ పుర ప్రజలకు శుభవార్తను అందించింది. తాము అధికారంలోకి వస్తే చెత్త పన్ను ఎత్తివేస్తానని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు సిద్ధమయ్యారు. కూటమి విజయం సాధించగానే చెత్త పన్ను వసూలు నిలిపివేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం ఏర్పడ్డాక చెత్త పన్ను రద్దు చేస్తే జీవో విడుదల చేయనుంది. వైసీపీ ప్రభుత్వం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపల్ ప్రజల నుంచి చెత్త పన్ను రూ.9.48 కోట్లు వరకు వసూలు చేసింది. ఆస్తి పనుల కంటే ఎక్కువగా ప్రజల ముక్కు పిండి మరీ చెత్త పన్ను వసూలు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కింది. క్లాప్ పేరుతో నూతన పారిశుధ్య విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంది. దీనిని అమలులో చతికిల పడింది. క్లాప్ అట్టర్ ప్లాప్ అయింది. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేయాల్సిన వైసీపీ ప్రభుత్వం ఈ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకుంది. వలంటీర్లకు లక్ష్యాలు విధించి మరీ చెత్త పన్ను వసూలు చేయించారు. దీంతో వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించే సమయంలో చెత్త పన్ను మినహాయించుకున్న సంఘటనలున్నాయి.

ఒక్కో ఇంటి నుంచి రూ.720 వసూలు

సేవా రుసూము పేరుతో చెత్తకు పన్ను విధించడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా మున్సిపల్ అధికారులు బెదిరించి మరీ చెత్త పన్ను వసూలు చేశారు. పరిశుభ్రత లేకుండా చెత్త పన్ను ఏమిటని ప్రజలు ప్రశ్నించినా లెక్క చేయలేదు. పారిశుధ్య పనులకు అయ్యే ఖర్చును ప్రజలపైనే భారం వేశారు. పేద.. ధనిక అన్న తేడా లేకుండా ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.60 నుంచి రూ. 120 వరకు వసూలు చేసింది. ఆ ప్రకారం ఏడాదికి రూ.720 వసూలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో పేదల గృహాలకు ఇంటి పన్ను కంటే చెత్త పన్ను అధికంగా వసూలు చేశారంటే ఆశ్చర్యం కాదు. స్థానిక సంస్థల నింబంధనల ప్రకారం ఆస్తి పన్నులో పారిశుధ్య పన్ను కూడా కలిసి ఉంటుంది. అయినా ప్రత్యేకంగా చెత్త పన్ను వసూలు చేసి వైసీపీ ప్రభుత్వం తన ప్రత్యేకతను చాటుకుంది.

సేవా రుసుము పేరుతో బాదుడు

గుంటూరు కార్పొరేషన్‌లో 2,17,544 ఇళ్లు ఉండగా వీటిలో 14,720 వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్టుగా గుర్తించి సేవా రుసుము పేరుతో చెత్త పన్ను బాదేశారు. ఇంటికి రూ.60, హోటళ్లకు రూ.1000, బార్ అండ్ రెస్టారెంట్లకు రూ.2000, 40 పడకల ఆస్పత్రులకు రూ.7500, కల్యాణ మండపాలకు రూ.2500 నుంచి రూ.7500, విద్యా సంస్థలకు రూ.300 నుంచి 2000 వరకు చెత్త పన్నును అమలు చేశారు.

చెత్త పన్ను వసూలు మున్సిపాల్టీల వారీగా..

మునిసిపాల్టీ	వసూలు చేసిన పన్ను
నరసరావుపేట	96,54,888
చిలకలూరిపేట	1,16,98,990
మంగళగిరి, తాడేపల్లి	1,86,17,910
తెనాలి	3,61,31,720
బాపట్ల	59,16,790
చీరాల	1,05,18,470

వెబ్‌సైట్‌లో అలానే ఉంచిన సీడీఎంఏ



దేశంలో ఎక్కడా లేని విధంగా వైసీపీ ప్రభుత్వం విధించిన చెత్త పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంకా మున్సిపల్ పరిపాలన శాఖ అధికారుల తీరులో మార్పు లేదు. సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) శాఖ నేటికీ చెత్తపన్ను బకాయిలను అలానే వెబ్‌సైట్‌లో ఉంచింది. వైసీపీ ప్రభుత్వం పతనమైపోయినా ఇంకా సీఎల్‌ఏపీ పేరుతో ఆరు నెలల చెత్త పన్ను బకాయిని చూపెడుతున్నది. సీడీఎంఏ వెబ్‌సైట్‌లో నేటికీ సీఎల్‌ఏపీ ఆప్షన్‌కు వెళ్లి యూజర్ ఫీజు బకాయి చూస్తే ప్రతీ కుటుంబంపై రూ.720 బకాయి చూపిస్తున్నది. 2021 అక్టోబరు మొదలు 2022 మార్చి వరకు బకాయి ఉన్నట్లు చూపుతున్నది.

అక్రమ మైనింగ్‌పై విస్తృత తనిఖీలు

- ఇప్పటికే రూ.40 కోట్లకు పైగా అపరాధ రుసుము విధింపు



6లో..

సోషల్ మీడియాలోఎంఈవో ఫేక్‌పోస్టులు

- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

6లో..

అమరావతిలో.. పనుల సందడి



హైకోర్టు నుంచి హెచ్‌వోడీ క్వార్టర్స్ వరకు...



సీడ్ యాక్సెస్ రోడ్డులో..

ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన అమరావతిలో పనుల హడావుడి మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో ఆగిపోయిన పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ అధికారులు రంగంలోకి దిగారు. రెండు రోజులుగా జరుగుతున్న పనులతో రాజధాని గ్రామాల్లో కూలీలు, యంత్రాల సందడి నెలకొంది. చిట్టడివిలా మారిన రాజధాని ప్రాంతంలో ముళ్ల కంపలను 76 ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్నారు. ఉద్దండ్రాయుని పాలెంలో అమరావతికి మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగిస్తున్నారు. రోడ్ల మధ్యలో ఏర్పడిన గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకుంటున్నారు. ఐఏఎస్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు, హైకోర్టు జడ్జీల బంగ్లాల వద్ద పనులు చేపట్టారు. శనివారం సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ ఆయా పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు.

\- తుళ్లూరు



పెదపరిమి నుంచి తుళ్లూరు వెళ్లే రోడ్డులో పిచ్చి చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్లు



కేంద్ర మంత్రివర్గంలో.. చోటుదక్కేనా?

- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పెమ్మసాని పేరు
- సీనియర్ హోదాలో శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నాలు

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అనూహ్య విజయం సాధించిన ఎన్‌డీఏ కూటమి ఎంపీలలో కొందరికి కేంద్ర మంత్రివర్గంలో అడుగుపెట్టే అవకాశం వచ్చింది. కూటమిలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ కూడా ఉండటంతో ఆ పార్టీ వారికి కూడా ఒకరిద్దరి కి అవకాశాలు దక్కనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కూటమి తరఫున ముగ్గురు ఎంపీలు ఎన్నికయ్యా రు. వారిలో గుంటూరు నుంచి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ గెలుపొందారు. ఎంపీగా తొలిసారే పార్లమెంటులోకి అడుగుపెడుతున్న ప్పటికీ మంచి మెజార్టీతో విజయం సాధించి గుంటూరు లోక్‌సభ స్థానంలో రికార్డు సృష్టించారు. పెమ్మసాని తన ప్రత్యర్థి కంటే 3 లక్షల 44వేల ఆధిక్యతతో విజయ ఢంకా మోగించారు. రాజకీయాలకు కొత్తైనప్పటికీ ఎంతో అనుభవి జ్ఞుడిగా అడుగులు వేసి లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూటమి అభ్య ర్థులు విజయం సాధించడంలో తన వంతు పాత్ర పోషించారు. ముఖ్యంగా గుంటూరు తూర్పు నియోజక వర్గంలో రెండు దశాబ్దాల తర్వాత టీడీపీ జెండా ఎగురవేయటంలో పెమ్మసాని కీలకంగా వ్యవహరించారు. పైగా పార్టీ సుప్రీం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ ఈ ఎన్నికల్లో పార్టీకి ఆర్థికంగా అండగా నిలిచి మంత్రి రేసులో ముందంజలో ఉన్నారు. పైగా రాజధాని ప్రాంత ఎంపీ కావడంతో పెమ్మసానికి కేంద్ర మంత్రి పదవి దక్కితే అమరావతి అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందనే భావన కూడా పార్టీ వర్గాల్లో ఉంది. నరసరావుపేట నుంచి రెండో సారి గెలుపొందిన లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా కేబినెట్ మంత్రి పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న లావు తనకున్న అనుభవం దృష్ట్యా చంద్రబాబు తన పేరు కూడా పరిశీలిస్తారని ఆశిస్తున్నారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకు చెందిన వల్లభనేని బాలశౌరి జనసేన తరఫున మచిలీపట్నం నుంచి పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు. రెండో సారి పార్లమెంటులోకి అడుగుపెడుతున్న ఆయన కూడా మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సోషల్ మీడియాలో ఎంఈఓ ఫేక్‌పోస్టులు

● ఉపాధ్యాయ సంఘాల మండిపాటు



విద్యాశాఖ అధికారి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో స్ర్కీన్ షాట్

పొన్నూరుటౌన్, జూన్‌8: ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్న విద్యాశాఖ అధికారి తీరు పట్ల ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పొన్నూరులో ఎంఈవోగా పని చేస్తున్న శోభచంద్.. వైఎస్ జగన్ ఫాలోయర్స్ పేరిట ఏర్పాటైన వాట్సప్ గ్రూప్‌లో పెట్టిన పోస్టులు తీవ్ర వివాదస్పదం అవుతున్నాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలు ట్యాంపరింగ్ చేశామని చంద్రబాబు ఒప్పుకుంటున్నాడు అన్న ట్యాగ్‌తో ఉన్న వీడియోను శోభచంద్ తన ఫోన్ నుంచి పోస్టు చేయటం ఉపాధ్యాయ వర్గాల్లో కలకలంగా మారింది. యూట్యూబ్‌లో వచ్చిన ఒక వీడియోను శోభచంద్ పోస్టు చేస్తూ ఈవీఎంలు అబ్రకదబ్ర అని కామెంట్ కూడా జోడించాడు. శోభచంద్ వైసీపీతో అంటకాగి గత ఐదేళ్లుగా ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురిచేసినటట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారిన తన పంథా మార్చుకోలేదన్నారు. ఎంఈవో తీరు పట్ల విద్యాశాఖ అధికారులు కూడా గురుగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల సర్వీస్ రూల్స్ ఉల్లంఘించి ఉన్నతాధికారులకు తెలియకుండా విదేశీ పర్యటనలు సైతం చేయటం పట్ల ఎంఈవోకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఉపాధ్యాయులు గుసగుసలాడుకుంటున్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



కూటమి విజయంతో కోటప్పకొండకు పాదయాత్ర

నరసరావుపేట టౌన్, జూన్ 8: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడంతో పట్టణంలో ఎన్‌జీవో కాలనీ నుంచి కొటప్పకొండ వరకు తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళలు శనివారం పాదయాత్ర చేశారు. ఎన్‌జీవో కాలనీలోని అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళ పాదయాత్రను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేగా అరవిందబాబు విజయం సాధించినందుకు ఈ పాదయాత్ర చేస్తున్నామని మహిళలు అన్నారు. పాదయాత్రగా కోటప్పకొండకు వెళ్లి త్రికోటేశ్వరుని దర్శించుకొని మహిళలు మొక్కు తీర్చుకున్నారు.

అక్రమ మైనింగ్‌పై విస్తృత తనిఖీలు

ఇప్పటికే రూ.40 కోట్లకు పైగా అపరాధ రుసుము విధింపు

దాచేపల్లి, జూన్‌8: గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలు తవ్వకాలపై మైనింగ్‌శాఖ అధికారులు నిశితంగా దృష్టి సారించారు. వైసీపీ నాయకులు అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మైనింగ్ క్వారీలు చేపట్టారు. మరికొందరు నామమాత్రపు లీజులు తీసుకొని పదుల సంఖ్య ఎకరాల్లో మైనింగ్ క్వారీయింగ్ నిర్వహించారు. దీనిపై గత ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు అధికారులు మౌనం వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితులు మారి నూతన ప్రభుత్వం ఏర్పడటంతో అధికారులు గతంలో జరిగిన అక్రమాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సున్నపురాయి గనులకు పేరుగాంచిన దాచేపల్లి, పిడుగురాళ్ల తదితర గ్రామాలలో నిర్వహించిన క్వారీలపై దృష్టి సారించారు. పిడుగురాళ్ల మండలంలో లారీల్లో తరలిస్తున్న సున్నపురాయి లోడుతో వున్న మూడు లారీలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మండలాల్లో 40 మైనింగ్ క్వారీలున్నాయి. వీటిపై ఇప్పటివరకు 40 నుంచి 50 కోట్ల రూపాయల వరకు అపరాధ రుసుం విధించారు. ప్రధానంగా కోనంకి, కొండమోడు, కేశాను పల్లి, నారాయణపురం, నడికూడి, గామా లపాడు, తంగెడ, దాచేపల్లి, ధైద తదితర గ్రామాలలో నిర్వహిస్తున్న క్వారీల్లో అవినీతి విలయతాండవం చేసిందని అధికారుల దృష్టికి వచ్చింది. దాచేపల్లి మైనింగ్ ఏడీ అశోక్‌బాబు ఆధ్వర్యంలో గురు, శుక్ర, శనివారాల్లో ఆయా క్వారీలలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు.



మైనింగ్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు పట్టుకున్న అధికారులు

ఎన్నికల కోడ్ ఉన్నా ఆగని తవ్వకాలు

సార్వత్రిక ఎన్నికలతో ఎన్నికల కోడ్ వున్నా ఎన్నికల ఫలితాలు వెల్లడించి ప్రభుత్వం మారినా మైనింగ్ తవ్వకాలు మాత్రం యథేచ్ఛగా జరగటం విశేషం. అధికారులు దాడులు చేపట్టడంతో పిడుగురాళ్లలో మూడు లారీలతో పాటు దాచేపల్లిలో మూడు ట్రాక్టర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ అక్రమదారులకు క్వారీల నుంచి వస్తున్న ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారుల ఆదేశాలను కూడా బేఖాతరు చేసి మైనింగ్ నిర్వహించడం విడ్డూరం. అధికారం మాదేనన్న ధీమాతో వైసీపీ నేతలు చేసిన అక్రమాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తు న్నారు. మరికొన్ని రోజుల్లో అక్రమ క్వారీయింగ్ జరిగిన ప్రాంతాలను గుర్తించి కోట్ల రూపాయల అపరాధ రుసుం విధించే అవకాశం వుంది. జిల్లా స్థాయి అధికారులు కూడా పల్నాడులో జరుగుతున్న మైనింగ్ అక్రమాలపై జిల్లా అధికారులు కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు.

పరారీలో అక్రమ మైనింగ్ వ్యాపారులు

మైనింగ్ అధికారులు క్వారీలపై దాడులు చేసి ఇప్పటివరకు జరిగిన క్వారీయింగ్‌పై వివరాలు సేకరిస్తుండటంతో అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేసి అక్రమార్జన చేసిన వైసీపీ నేతలు అందుబాటులో లేకుండా పోయారు. కనుచూపు మేరలో కూడా నేతలు కనపడకపోవడం జరిగింది. ఏళ్లతరబడి మైనింగ్ చేపట్ట డంతో ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు.

మల్లన్న సేవలో జస్టిస్ జ్యోతిర్మయి



జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు మల్లేశ్వరస్వామి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో ప్రసాదరావు

పెదకాకాని, జూన్ 8: గుంటూరు జిల్లా పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దంపతులు శనివారం దర్శించారు. ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించి స్వామి వారికి అభిషేకం, భ్రమరాంబ అమ్మవారికి కుంకుమ పూజ జరిపించారు. అనంతరం జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈవో శ్రీరామ వరప్రసాద్ జస్టిస్ దంపతులకు మల్లేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు.

పశ్చిమ గోదావరిపై కృష్ణా ఘన విజయం



మెహెక్ (52 నాటౌట్)



రిషిక (60)

మంగళగిరి సిటీ, జూన్ 8: ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-19 మహిళల వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో కృష్ణా జిల్లా జట్టు పశ్చిమ గోదావరిపై 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కృష్ణా జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు సాధించింది. రిషిక కృష్ణన్ 123 బంతుల్లో 7 ఫోర్లతో 60 పరుగులు సాధించగా, కృష్ణా బౌలర్ లక్ష్మీ అపర్ణ 8 ఓవర్లలో పది పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జిల్లా జట్టు 31.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జాస్రా మెహెక్ 62 బంతుల్లో 9 ఫోర్ల సాయంతో 52 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది.

ఆ ఖాకీలు నా గడప తొక్కొద్దు!

● ఎస్‌ఐలను వెనక్కి పంపిన ఎమ్మెల్యే యరపతినేని


పిడుగురాళ్ల, జూన్‌8: అధికార మార్పిడి జరుగడంతో తెలుగుదేశం పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు కొందరు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అటువంటి ఆలోచనలతో వున్న కొందరు ఎస్‌ఐలకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నో ఎంట్రీ చెప్పారు. తనను కలిసేందుకు గుంటూరు దాకా వచ్చిన కొందరు ఖాకీలను ఇంటి బయట నుంచే పంపించివేశారు. వాళ్లు నన్ను కలవాల్సిన అవసరం లేదు.. నాతో మాట్లాడాల్సిన పనిలేదు.. గేటు వద్ద నుంచే పంపివేయండి అంటూ యరపతినేని గన్‌మెన్‌లకు చెప్పడంతో వైసీపీ భక్త ఎస్‌ఐలు మొఖం నేలకేసుకొని ఇంటిబాట పట్టారు. వైసీపీ పాలనలో అడ్డగోలుగా వ్యవహరించి.. ఆ పార్టీ నేతలు చెప్పిందే వింటామంటూ గురజాల నియోజకవర్గంలో కొందరు పోలీసు అధికారులు వ్యవహరించారు. వారు పేరుకే ఖాకీలు ధరించారు గానీ వైసీపీ కార్యకర్తల్లా పనిచేశారు. టీడీపీకి చెందిన శ్రేణులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు.. చాలా మందిని విచక్షణారహితంగా కొట్టి అక్రమ కేసులు బనాయిస్తూ వైసీపీ నేతలు చెప్పిందల్లా చేసి తలలు ఆడించారు. ఆ పోలీసులకు ఇప్పుడు కనువిప్పు కలిగినట్లు, మారుమనసు పొందినట్లు నటిస్తున్నారు. పోలీసులు... పోలీసుల్లా వ్యవహరించాలంటూ అనేకసార్లు యరపతినేని సూచించినప్పటికీ... వైసీపీ నేతలకు తలలూపుతూ నేతలు చెప్పిందే వేదంలా పనిచేసిన ఎస్‌ఐలు ఇప్పుడు బిక్కమొఖం వేస్తున్నారు. వైసీపీ నేతలు కొందరు పోలీసుల చేత అన్ని తప్పులు చేయిస్తారు... ఆ తరువాత పట్టించుకోరని చెప్పినా కొందరు అధికార దర్పంతో వ్యవహరించి ఇప్పుడు తలలు పట్టుకున్నా ఉపయోగం ఏమిటంటూ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా గురజాల నియోజకవర్గంలో నియంతలా పనిచేసిన వారికి చట్టప్రకారం నడుచుకోవాలని సూచించినా కొందరు పెడచెవిన పెట్టారని, అలాంటి సీఐలకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనదైన శైలిలో వ్యవహరించినట్లు తెలుస్తుంది.

రాష్ట్రానికి పట్టిన జగన్ పీడ విరగడైంది



నరసరావుపేట టౌన్, జూన్‌8: రాష్ట్రంలో కూటమి విజయం, జగన్‌మోహన్‌రెడ్డి ఓటమితో రాష్ట్రానికి పట్టిన పీడ విరగడైందని ప్రజలు బావిస్తున్నారని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ అరాచక పాలన పోయి అభివృద్ధి పాలన మొదలు అవుతుందని ప్రజలు సంతోషంగా ఎదురు చూస్తున్నారని అన్నారు. కేంద్రంలో చంద్రబాబునాయుడు కీలకంగా ఉన్నారని తెలిపారు. జాతీయ మీడియాలో కూడా చంద్రబాబు ఉన్నతిని కొనియాడుతున్నారని చెప్పారు. ఇటీవల వరకు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన తనకు పల్నాడు జిల్లాలో ఏడు అసెంబ్లీలలో విజయం సాధించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కూటమి విజయంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. చంద్రబాబునాయుడు సహకారంతో పల్నాడు వాటర్ గ్రిడ్ పూర్తిచేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజాసమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, భగవంతుడు, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తానన్నారు, భారీ మెజారిటీతో పల్నాడు ప్రజలు ఇచ్చిన విజయాన్ని మరచిపోలేనన్నారు. సమావేశంలో గొట్టిపాటి జనార్ధన్‌బాబు, రావర్ల జగ్గారావు, దాసరి ఉదయశ్రీ, కోట నాగసుధీర్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి బత్తుల రాజీనామా



రాజీనామా చేస్తున్న దేవానంద్

గుంటూరు(తూర్పు), జూన్ 8: ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్టు బత్తుల దేవానంద్ తెలిపారు. గుంటూరు, అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల పదవి కాలంలో జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గ్రంథాలయాలకు రావాల్సిన రూ.20కోట్ల సెస్సును వసూలు చేసామని గుర్తుచేశారు. నిధులతో పాటు దాతల సహకారంతో జిల్లా గ్రంథాలయంలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. తనకు సహకరించిన సిబ్బంది, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వాగులో పడి ఇద్దరు చిన్నారుల మృతి



ప్రసంగి (పాత చిత్రం)



ఈశ్వర్

పెదకూరపాడు, జూన్‌8: గేదెల వద్దకు వెళ్లి ఇరువురు చిన్నారులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని లింగంగుంట్లలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన కుక్కమళ్ళ ఏసుదాసు, కోటమ్మ దంపతుల రెండో కుమారుడు ప్రసంగి(15) 10వ తరగతి చదివాడు. సారెకుక్క నీలాంబరం, నాగమణి దంపతుల కుమారుడు ఈశ్వర్(14) 9వ తరగతి చదివాడు. వీరిరువురు శనివారం లింగంగుంట్ల రైల్వే స్టేషన్ సమీపంలో 11 గంటల సమయంలో గేదెలు మేపేందుకు వెళ్లారు. సాయంత్రం అవుతున్న ఇంటికి రాక పోవటంతో ఎన్నిసార్లు ఫోన్‌లు చేసినా వారి పిల్లలు ఫోన్‌లు స్పందించక పోవటంతో తల్లిదండ్రులు వెతికారు. సమీపంలోని జగడాల వాగు గట్టుపై బట్టలు ఉండటాన్ని గమనించి వాగులోకి దిగి వెతికారు. వాగులో దిగి చూడగా విగత జీవులుగా ఉన్నారు. వారిలో కొద్దిగా కదలిక వచ్చినట్టు భావించి పెదకూరపాడులోని వైద్యశాలకు తీసుకు రాగా ఈశ్వర్ మృతి చెందాడని డాక్టర్ ధ్రువీకరించారు. ప్రసంగిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఇరువురి కుటుంబాల్లో ఇరువురు మృతి చెందటంతో విషాదం నెలకొంది. వారి కుమారులు మృతి చెందటంతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కంట తడి పెట్టించింది.

రామోజీరావు జీవితం ఆదర్శనీయం

ఎమ్మెల్యే ఆనందబాబు



రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆనంద్‌బాబు

వేమూరు, జూన్ 8: పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో తనదైన ముద్ర వేసి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప చేసిన వ్యక్తి రామోజీరావు అని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శనివారం గుంటూరు క్యాంప్ ఆఫీసులో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి క్రమశిక్షణతో అంచలంచలుగా ఎదిగిన రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఆయన మృతి తెలుగు వారికి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ధారూ నాయక్

గుంటూరు, జూన్ 8: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారునాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత, నారా లోకేష్‌ని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధారూ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభంజనానికి ప్రజలు ఏకపక్షంగా మద్దతు ఇవ్వడమే కారణమన్నారు. అదేవిధంగా గిరిజనులు సైతం కూటమికే జై కొట్టారన్నారు. గాడి తప్పిన ఆంధ్రప్రదేశ్‌ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించాలంటే చంద్రబాబు నాయుడు వల్లే అవుతుందని ప్రజలు బలంగా నమ్మారని అన్నారు.

కౌలురైతు ఆత్మహత్య


మాచవరం, జూన్‌8: అప్పులబాధ తట్టు కోలేక కౌలురైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అమీనుద్దీన్ తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన చవడ బోయిన బొర్రయ్య (58) తనకున్న 80 సెంట్లు పొలంతో పాటు మరో 4 ఎక రాలు పొలం కౌలుకు తీసుకొని రెండేళ్లుగా మిర్చి పంట సాగు చేస్తున్నాడు. అయితే పంటలు సక్రమంగా పండక, పండినా గిట్టుబాటు ధర లభించక సుమారు రూ.12 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అమీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాంబు దాడుల కేసులో 17 మంది అరెస్టు.. రిమాండ్

నకరికల్లు, జూన్ 8: ఎన్నికల పోలింగ్ రోజున నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో యాసిడ్ బాంబులతో దాడి చేసిన కేసులో 17 మంది నిందితులను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ కే.నాగేంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

కృష్ణా పుష్కర ఘాట్‌లో రామోజీ సైకత శిల్పం

తాడేపల్లి టౌన్, జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు నివాళులర్పిస్తూ సైకత శిల్పాన్ని గుంటూరు జిల్లా సీతానగరంలోని పుష్కర ఘాట్‌లో ప్రముఖ సైకత శిల్పి వరప్రసాద్ ఏర్పాటు చేశారు. దాదాపు మూడు గంటలు శ్రమించి ఇసుకతో ఈ శిల్పాన్ని నిర్మించారు. అసమాన్యుడికి అశ్రునివాళి అంటూ ఏర్పాటు చేసిన ఈ శిల్పాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు.



ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం



నాటక పోటీలోని ఓ సన్నివేశం

పొన్నూరుటౌన్, జూన్8: పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళా ప్రాంగణంలో శనివారం 23వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. నన్నపనేని చంద్రమౌళీశ్వరి నటరాజ పూజలు చేసి పోటీలను ప్రారంభించారు. గిద్దల్లూరి శరధృతి ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం అలరించింది. తొలి నాటికగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటికను ఎం.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించారు. రెండవ నాటికగా మైత్రి కళా నిలయం విజయవాడ వారి బంధం సాంఘిక నాటికను ప్రదర్శించారు. మూడో నాటికగా నిశబ్దమా నీ ఖరీదెంత అనే నాటికను పిటి మాధవ్ రచనలో చెలసాని కృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించారు. తొలి రోజు నాటికల పోటీలు నాటక రంగ ప్రియులను విశేషంగా ఆకర్షించాయి. ఆహ్వాన నాటిక పోటీలను కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు నాయుడు గౌరవ అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు పర్యవేక్షించారు. సత్యహరిశ్చంద్ర, కాటి సీను పద్యాలాపనను కె.సాంబయ్య ప్రదర్శించారు. పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన నాటక రంగ ప్రియులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాటిక పోటీలను తిలకించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



లోకేశ్‌కు స్వీట్స్ అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాడిశెట్టి మురళీ

లోకేశ్‌కు మన్నవ మోహనకృష్ణ శుభాకాంక్షలు

గుంటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో అఖండ విజయాన్ని సాధించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అభినందనలు తెలియజేశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసిన మన్నవ పార్టీ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబు, లోకేశ్‌లకు తాడిశెట్టి మురళీ...

గుంటూరు, జూన్ 8 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి లోకేశ్‌లను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ కూటమి భారీ విజయం సాధించిన నేపథ్యంలో చంద్రబాబు, లోకేశ్‌లను కలిసి అభినందనలు తెలియజేశారు.

లోకేశ్‌కి డిప్యూటీ మేయర్ సజల...

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 8 : రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల తెలిపారు. నారా లోకేశ్‌ను శనివారం కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



లోకేశ్‌కి అభినందనలు తెలుపుతున్న సజీల, షౌకత్ తదితరులు

11న సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డు ప్రదానం

గుంటూరు(తూర్పు), జూన్ 8 : తెనాలి రూరల్ మండలం, ఖాజీపేటకు చెందిన సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న అవార్డు ప్రదానోత్సవం ఈ నెల 11న స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని, అన్నమయ్య కళా వేదికపై జరగనున్నట్టు పరిషత్ అధ్యక్షుడు చిటుమడుగుల భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్ర మంలో భాగంగా విద్యాప్రదాత సీ హెచ్ సాంబయ్య స్మారక అవార్డును తిరుపతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దేవురు భారతికి ప్రదానం చేయనున్నట్టు అన్నారు. అంతేగాక ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధికంగా 599/600 మార్కులు సాధించిన విద్యార్థిని ఆకుల వెంకట నాగసాయి మనస్వినికి రూ.10 వేల ప్రోత్సాహక నగదుతో పాటు ప్రతిభా పురస్కారం అందజేయనున్నట్టు వివరించారు. ఇదే వేదికపై విజయవాడకు చెందిన నాట్యమయూరి లేఖ్యా భరణీ బృందంచే నృత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

జీవో 117 రద్దు చేయాలని ఏపీటీఎఫ్ డిమాండ్

గుంటూరు(విద్య), జూన్ 8 : విద్యాశాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగజేస్తున్న జీవో నెంబర్117ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు కోరారు. సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించటంపై ఏపీటీఎఫ్ సంఘం తరపున కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలుపుతున్నట్లు మేకల సుబ్బారావు తెలిపారు. విద్యారంగంలో గత 5 సంవత్సరాల కాలంలో జరిగిన అనేక అవకతవకలపై విచారణ జరపాలని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో చాలా మంది ఉపాధ్యాయులకు మే నెల జీతాలు పే చేయలేదని వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయులు చెల్లించాలని ఆయన కోరారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్ల ప్రమోషన్స్ ఆపాలని ఆదేశాలు

గుంటూరు సిటీ, జూన్ 8 : జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ల ప్రమోషన్‌లకు బ్రేక్ పడింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొలువు తీరిన తర్వాత ప్రమోషన్‌ల వ్యవహారంలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో జిల్లాలోని 164 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్ల ఆశలపై నీళ్లు పడ్డాయి. వాస్తవానికి వారిని అగ్రికల్చర్ అసిస్టెంట్ నుంచి వ్యవసాయ విస్తరణ అధికారులుగా నియమించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అందుకు అనుగుణంగా జాబితా తయారు చేసిన జిల్లా వ్యవ సాయ అధికారులు రాష్ట్ర అధికారుల అనుమతి కోసం వేచి చూస్తుండగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం మారటంతో ప్రమోషన్‌ల వ్యవహారంలో బ్రేక్ పడింది.

నసీర్‌కు వాసవి క్లాత్ మార్కెట్ అసోసియేషన్ శుభాకాంక్షలు

గుంటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తూర్పు ఎమ్మెల్యేగా గెలుపొందిన నసీర్‌కు మూడోరోజు కూడా అభినందనల వెల్లువ కొనసాగింది. నియోజకవర్గంలోని వాసవి క్లాత్ మార్కెట్ అసోసియేషన్ నేతలు సాంబశివరావు, సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు నసీర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తనను గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

● టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరుపున సత్తెనపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణకు టీడీపీ నగర కార్యదర్శి కొల్లి అనీల్, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ కొల్లి బాలకృష్ణ, మర్రి నాగేశ్వరరావులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనను సన్మానించారు. కాగా గుంటూరు వచ్చిన ఎమ్మెల్యే గౌతు శిరీషను కూడా నేతలు కలిసి అభినందించారు.

యరపతినేనికి దానబోయిన అభినందనలు

తాడేపల్లి టౌన్, జూన్ 8: గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన యరపతినేని శ్రీనివాసరావును గుంటూరులోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్ శనివారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యరపతి నేనిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో దానబోయిన సుందరరావుయాదవ్, తోట సాంబయ్య, సింకా కోటేశ్వరరావు, ఆళ్ల వెంకటనారాయణ, తోట సురేష్, తదితరులు పాల్గొన్నారు.



యరపతినేనికి శుభాకాంక్షలు తెలుపుతున్న దానబోయిన

లోకేశ్ గెలుపుపై ఎస్టీ నేతల హర్షం



ఎమ్మెస్సెస్ భవన్‌లో కేకు కట్ చేస్తున్న ఎస్టీ సెల్ నేతలు

మంగళగిరి, జూన్ 8: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయభేరి, మంగళగిరిలో నారా లోకేశ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంపై ఎస్టీ సెల్ నేతలు హర్షం వెలిబుచ్చారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్ లో శనివారం ఎస్టీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పేరం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వర ప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరిలో నారా లోకేశ్ తిరుగులేని మెజార్టీతో గెలు పొంది రికార్డు సృష్టించారని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి లోకేశ్ తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ నేతలు బండి రమేష్, మానుపాటి గోవింద్, మానుపాటి రామకృష్ణ, సమతం పాపారావు, సింగం శ్రీను, భారతి వాసు, వంగర అన్నవరం, ప్రసాద్, ఎలుబాట రామకృష్ణ, భారతి తాతా రావు, మానుపాటి రమేష్ పాల్గొన్నారు.

అక్షర యోధుడు రామోజీరావుకు ఘన నివాళి

● రామోజీ సేవలను కొనియాడిన పలువురు ఎమ్మెల్యేలు



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు

గుంటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావుకు టీడీపీ శ్రేణులు శనివారం ఘనంగా నివాళులర్పించాయి. టీడీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రామోజీరావు ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించారని, మీడియా రంగంలో ఆయనది ప్రత్యేకమైన శకమని కొనియాడారు. గళ్లా మాధవి మాట్లాడుతూ రామోజీరావు సామాన్య కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలకు ఎదిగిన వ్యక్తి, ఆయన ఎంతోమందికి స్ఫూర్తి, ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో భీమినేని వందనాదేవి, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, కసుకుర్తి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు, కల్లూరి శ్రీనివాసరావు, బొబ్బిలి రామారావు, ఈరంటి వరప్రసాద్, పోతురాజు సమతా, మన్నవ వంశీకృష్ణ, ఘంటసాల సోమశేఖర్, మల్లె ఈశ్వరరావు, గుడిమెట్ల దయారత్నం, ఇత్తడి రత్నకుమారి, పుల్లా సుందరరాంబాబు, మహంకాళి నరసింహారావు, మన్నవ కోటేశ్వరరావు, పోతురాజు చంద్రశేఖర్, తల్లమ్ శేఖర్, ఇమ్మడి మల్లికార్జునరావు, నల్లపనేని విజయలక్ష్మి, సిరిపురపు శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే రామోజీరావు పార్థివదేహానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ తదితరులు

● రామోజీరావు మృతికి గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ సంతాపం వ్యక్తం చేశారు. పొన్నూరు రోడ్డులోని తూర్పు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలుగజేసిందన్నారు. కార్యక్రమంలో జాగర్లమూడి శ్రీను, ప్రభాకర్, వాణి తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోవెలమూడి రవీంద్ర(నాని) తదితరులు




రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కనపర్తి శ్రీనివాసరావు తదితరులు

● రామోజీరావు మృతికి సంతాపంగా టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) కార్యాలయంలో నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ కార్పొరేటర్లు, నేతలు పలువురు విద్యానగర్‌లో సంతాప కార్యక్రమం నిర్వహించారు.

● రామోజీరావు మృతికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన కృష్ణ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అలాగే మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు.

● గుంటూరు(తూర్పు), జూన్8: రామోజీ గ్రూపుల అధినేత రామోజీరావు మృతికి కమ్మ జన సేవా సమితి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్, పాలకవర్గ సభ్యులు వంకాయలపాటి బలరామ కృష్ణయ్య, ఘంటా పున్నారావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, వడ్లమూడి నాగేంద్ర. గుంటుపల్లి కోటేశ్వరరావు, వడ్లమూడి శివరామకృష్ణయ్య, రాయపాటి గోపాలకృష్ణ, పెద్ది సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రామోజీరావు మృతికి ప్రముఖ సినీ నటుడు, రచయిత, డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ, కళాదర్బార్ పొత్తూరి రంగారావు సంతాపాన్ని తెలిపారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు

● రామోజీరావు మృతికి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సంతాపం తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాష్యం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు, జూన్ 8 : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిన్నమనేని రామచంద్రరావు సంతాపం తెలిపారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉమాశంకర్ దంపతులు

● గుంటూరు (మెడికల్) జూన్ 8 : ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించినట్లు గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. శనివారం అహల్యా నర్సింగ్ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు అక్షర యోధుడుగా తెలుగు వారికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

● గుంటూరు, జూన్ 8: తెలుగు ప్రజలు గర్వించదగిన మీడియా దిగ్గజం రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరనిలోట ని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

● తెలుగు మీడియా, సినిమా రంగాల్లో కొత్త వరవడి సృష్టించిన మహనీయుడు రామోజీరావు మరణం తీరని లోటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ శనివారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

● ఈనాడు దినపత్రిక ద్వారా సామాజిక చైతన్యానికి ఊపిరిలూదిన రామోజీరావు మరణం యావత్తు బహుజనవర్గాలకు తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

● పత్రికా రంగంలో శిఖరాగ్రానికి చేరిన అక్షర యోధుడు రామోజీరావు మరణం తెలుగుజాతికే కాక యావత్ భారతావనికే తీరని లోటని గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● మీడియా మొఘల్, ప్రజా సమస్యల పోరాటయోధుడు, మార్గదర్శి సంస్థల అధినేత రామోజీరావు ఆకస్మిక మరణం తెలుగు జాతికి తీరనిలోటని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ తెలియజేశారు.

రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరనిలోటు

● టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య

మంగళగిరి సిటీ, జూన్ 8: తెలుగు ప్రజల జీవితాల్లో అత్యంత ప్రతిభావంతమైన ముద్ర వేసిన రామోజీరావు మృతి తీరనిలోటని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు కారంపూడి అంకమ్మరావు, ముమ్మిడి సత్యనారాయణ, పేరం శ్రీనివాసరావు, రంగిశెట్టి నరేంద్రతదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండల టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి స్థాని టీడీపీ నేతలు కేసంనేని శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు, వల్లూరు నరసింహారావు, హర్ష, వాసు, తదితరులు నివాళి అర్పించారు.

ప్రత్తిపాడు, జూన్ 8: స్థానిక టీడీపీ కార్యాలయంలో గింజుపల్లి శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, చెన్నుబోయిన శ్రీనివాసరావు, పమిడి శ్రీనివాసరావు, తదితరులు రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.



మంగళగిరిలో రామోజీరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

● ఫిరంగిపురంలోని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● రాజధాని మహిళలు రైతులు రైతు ధర్నా శిబిరాలలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పెదనందిపాడు, జూన్ 8: మహిళలు స్వయం ఉపాధి పెంపొందించుకుని ఆర్థికంగా మెరుగుపడాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఉత్తర అమెరికా, తెలుగు సంఘం (నాట్స్), సహకారంతో శనివారం మహిళలకు కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాట్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు మహిళలకు కుట్టు శిక్షణ ఏర్పాటు చేసి స్వయం సమృద్ధి సాధించాలని ఆకాక్షించారు. మొదటి విడతలో కుట్టు శిక్షణలో పాల్గొన్న మహిళలకు నూతి బాపయ్య చౌదరి అందించిన కుట్టు మిషన్లు అందించారు. నూతి బాపయ్య చౌదరి మాట్లాడుతూ తను జన్మించిన గ్రామం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఇటీవల రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న డాక్టర్ ఆళ్ల శ్రీవాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బాలకృష్ణ, ముద్దన నగరాజ కుమారి, పారిశ్రామికవేత్త ముద్దన రాఘవయ్య, కేంద్ర నిర్వాహకులు దొప్పల పూడి రమేష్‌బాబు, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రంలో వెండి పాదుకలు అపహరణ

● ఘటనపై శివస్వామితో మాట్లాడిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, జూన్ 8 : మండల పరిధిలోని తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో స్వామి వారి వెండి పాదుకలు శుక్రవారం అపహరణకు గురయ్యాయి. ఈ మేరకు తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో క్షేత్రం మేనేజర్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శనివారం తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ శైవక్షేత్రానికి వచ్చి పీఠాధిపతి శివస్వామితో ఘటన గురించి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన ఆదేశించారు.

చిర్రావూరులో పూరిల్లు దగ్ధం

తాడేపల్లి, జూన్ 8: మండలంలోని చిర్రావూరులో శుక్రవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తూ యడ్లపల్లి సాంబయ్య పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో సాంబయ్య ఇంటిలోని వస్తువులు, బంగారం, నగదు, డాక్యుమెంట్లు మొత్తం కాలిపోయి సుమారు రూ.3లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ నారా లోకేశ్ స్ఫూర్తితో రూ.20వేల ఆర్థిక సాయాన్ని సాంబయ్యకు అందజేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాస్ తక్షణ సాయం కింద రూ.5వేలు, 25 కిలోల బియ్యాన్ని అందించారు.





గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తన గెలుపునకు కృషి చేసిన ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని), మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను గళ్లా మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూన్ 8: సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి సీతారాముల ఆలయంలో 109 కొబ్బరికాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంపాలెం మూడుబొమ్మల సెంటర్‌లో ఉన్న శ్రీ సీతారాముల ఆలయంలో గళ్లా మాధవి మొక్కుకున్నారు. విజయం సాధించాక శనివారం స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గంటా పెద్దబ్బాయ్ ఆధ్వర్యంలో 109 కొబ్బరికాయలు కొట్టి స్వామి వారి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రజలందరి ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వ పాలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా వెంకట మౌళిక, రాజేష్, న్యాయవాది మొయినుద్దీన్, ముళ్ళపూడి చిట్టి, కిషోర్ తదితరులున్నారు.

వైసీపీ రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలు పునః ప్రారంభించాలి

● కన్నా, మాధవిలకు మాల మహానాడు వినతి

గుంటూరు, జూన్ 8 : వైసీపీ ప్రభుత్వం దళితులకు సంబంధించి రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలు పునఃప్రారంభించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన కన్నా లక్ష్మీనారాయణ, గళ్లా మాధవిలను కన్నా నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పథకాన్ని పున ప్రారంభించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం తొలగించిన 27 సంక్షేమ కార్యక్రమాలు తిరిగి పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదాజాన్‌పాల్, సత్తెనపల్లి నియోజకవర్గ కన్వీనర్ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

బాలికకు అరుదైన ఈఆర్‌సీపీ స్టెంట్ ఆపరేషన్

● జిల్లాలో ఇదే తొలిసారని వైద్యుల వెల్లడి

గుంటూరు (మెడికల్) జూన్ 8 : చిన్న వయసులోనే పసరుతిత్తిలో ఏర్పడిన రాళ్లతో తరచూ కడుపు నొప్పి, కామెర్లతో బాధపడుతున్న బాలికకు క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి ఆ బాధ నుంచి ఉపశమనం కలిగించినట్లు గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. బస్టాండ్ సమీపంలోని శ్రీ ప్రతిమ హాస్పిటల్‌లో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుంకలగుంటకు చెందిన ఈ బాలిక (16) గాల్‌స్టోన్ పాంక్రియాటైటిస్‌కు గురైందని, చిన్న పిల్లల్లో ఇలాంటి సమస్యలు ఏర్పడం అరుదని డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. బాలిక గత నెలలో కామెర్లు, కడుపునొప్పితో తమ ఆసుపత్రికి వచ్చినట్లు ఆయన తెలిపారు. వైద్య పరీక్షల్లో ఆశ్చర్యకరంగా ఆ బాలికలో ఎడమ వైపు ఉండాల్సిన గుండె కుడి వైపు ఉన్నట్లు, కాలేయం, ఇతర అంతర్గత అవయవాలు వ్యతిరేఖ దిశలో ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. దీంతో శస్త్రచికిత్స చేయడం కష్టసాధ్యంగా మారిందన్నారు. రెండు గంటల పాటు శ్రమించి పసరు తిత్తిలో రాళ్లు తొలగించేందుకు 'ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కొలాంజియో ప్యాంక్రియాటోగ్రఫీ' (ఈఆర్‌సీపీ) స్టెంట్ విజయవంతంగా అమర్చినట్లు డాక్టర్ సాయికృష్ణ వెల్లడించారు. బాలికకు ఈ తరహా ఈఆర్‌సీపీ స్టెంట్ వేయడం జిల్లాలో ఇదే తొలిసారని ఆయన ప్రకటించారు. బాలిక కోలుకోవడంతో డిశ్చార్జీ చేసినట్లు తెలిపారు.

విభజన హామీల అమలుకై కేంద్రంపై ఒత్తిడిచేయాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), జూన్ 8 : రాష్ట్రంలో ఎన్నికైన కొత్త ప్రభుత్వం ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు కోరారు. బ్రాడీపేటలోని జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుందని, దానికి తగ్గట్టు విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పాశం రామారావు వైనేతాజీ, ఈమని అప్పారావు, ఎం.చెంగయ్య, రవి, కె.నళినీకాంత్, డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గళ్లా మాధవి ఎమ్మెల్యేగా గెలుపొందడానికి కృషి చేసిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బీసీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్యను గుజ్జనగుండ్ల ముస్లిం నేతలు సన్మానించారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పులి పృథ్వీరాజ్, ఖదర్ బుడే, గాలిబ్ సైదా, బాజీ, ముస్తఫా, నిర్మల్ ప్రసాద్, పాల్గొన్నారు. **- గుంటూరు.**

నారా లోకేశ్‌కు అక్కులప్పనాయక్ శుభాకాంక్షలు

తాడేపల్లి టౌన్, జూన్ 8: ఉండవల్లిలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా టీఎస్ఎఫ్, ట్రైబల్ ప్రజాసమాఖ్య 28 జిల్లాల గిరిజను లందరూ మహాకూటమికి సహకరించారని లోకేశ్‌కు విన్నవించారు. నామినేటెడ్ ప్రభుత్వ పదవుల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యం ఇవ్వాలని లోకేశ్‌ను కోరినట్టు నాయక్ తెలిపారు.



నారా లోకేశ్‌ను కలిసిన అక్కులప్ప నాయక్

రాజధాని నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు రైతుల విజ్ఞప్తి

తుళ్లూరు, జూన్ 8: రాజధాని నిర్మాణ పనుల వేగవంతం చేయాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌ను రైతులు కోరారు. పెదపరిమి కల్యాణ మండపంలో శనివారం మండల టీడీపీ నేత రావెల గోపాలకృష్ణ మనవడి పుట్టిన రోజు వేడుకలకు హజరైన సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌ను రైతులు కలిశారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అంటేనే అభివృద్ధికి పేరన్నారు. అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు అమలు పక్కాగా జరుగుతాయన్నారు.

పబ్లిక్ ప్రకటన

నా క్లయింటు M/s. సాయి భారతి హోమ్స్, గుంటూరు, తరపున మేనేజింగ్ పార్ట్నర్ శ్రీమతి గడ్డిపాటి భారతి గారి సంజాయిషీ పొంది క్రింది విషయాలు పబ్లిక్ సమాచారం కొరకు తెలియజేయు చున్నాను.
మా క్లయింట్ క్యాపిటల్ ఎడ్జ్ అను అపార్ట్‌మెంటు ను మంగళగిరిలో నిర్మాణం చేసియున్నారు. ల్యాండ్ లార్డ్స్, బిల్డర్ మధ్య ఉన్న జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంటు ప్రకారం, ల్యాండ్ లార్డ్స్, బిల్డర్ అయిన మా క్లయింటు కు క్రింది బకాయిలు చెల్లించవలసియున్నది. 1) Refundable Deposit, 2) Labour Cess, Electricity Deposit, Club House, Play area equipment Cost, Club House amenities charges, 3) Maintenance Charges, 4) Property Tax on Flats, V.L.T., మునిసిపల్ వాటర్ పైప్ లైన్ చార్జస్ etc., ల్యాండ్ లార్డ్స్ చెల్లించనందున మా క్లయింట్ Guntur 2nd ADJ కోర్టులో O.S. No. 63/24 & 73/24 ద్వారా దావాలు వేసి, ల్యాండ్ లార్డ్స్ కి సంబంధించిన ఫ్లాట్స్‌పై అటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంట్ కోరియున్నారు. ఆ రెండు దావాలు పెండింగులో ఉన్నవి. పై బకాయిలు ల్యాండ్ లార్డ్స్ వారి ఫ్లాట్ల దామాషా ప్రకారం చెల్లించని యెడల ల్యాండ్ లార్డ్స్ కు సంబంధించిన ఫ్లాట్స్‌కు నీటి సరఫరా నిలిపివేయబడును. సదరు ఫ్లాట్స్‌కు NOC యివ్వబడదు. క్లబ్ హౌస్ ప్రవేశం నిషేధం. Parking lots allot చెయ్యబడదు. హౌస్ కీపింగ్ మెయిన్టినెన్స్ మొ॥నవి Provide చెయ్యరు. కనుక ఎవరైన ల్యాండ్ లార్డ్స్ దగ్గర ఫ్లాట్స్ కొని ఉన్న, కొనాలని ఆలోచిస్తున్నా పై విషయాలు గమనించి నిర్ణయము తీసుకోవలసినదిగా ప్రజలందరికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు కొల్లా వెంకటేశ్వర్లు, అడ్వకేట్, గుంటూరు. 9441072948



టీడీపీ నాయకులను అభినందిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

టీడీపీ నేతలకు ఆలపాటి అభినందన

కొల్లిపర, జూన్ 8 : కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించినందుకు కొల్లిపర మండల టీడీపీ నాయకులను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందించారు. శనివారం కొల్లిపర మండల టీడీపీ నాయకులు గుంటూరు వెళ్ళి రాజేంద్రప్రసాద్‌ను కలవటంతో గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాజేంద్రప్రసాద్‌ను కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చిన్న కోటిరెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు బొమ్ము శివారెడ్డి, ఆళ్ళ సురేష్‌రెడ్డి, ఆళ్ళ సత్యన్నారాయణరెడ్డి, విప్పల రమేష్‌రెడ్డి, కొల్లి కోటిరెడ్డి, పాలడుగు జోగేంద్ర, రవిశ్రీను, ఆంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో రవి

ఉపాధి పనులను సద్వినియోగించు కోవాలి

కొల్లిపర, జూన్ 8: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను పేదప్రజలు సద్వినియోగించు కోవాలని డీఆర్‌డీఏ ఏపీవో ఎం. రవి అన్నారు. శనివారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర, వల్లభాపురం, అన్నవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధిహామీ పనులపై కూలీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. రవి మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు చేసిన పనుల మేరకు వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుకూరు రాజేంద్ర, వల్లభాపురం బుజ్జి, కనపర్తి సాగర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తెనాలి అర్బన్,జూన్8: షరాఫ్ బజారులోని పంచముఖ అంజనేయ స్వామి ఆలయంలో వార్షికోత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం గాయత్రి హోమం, హనుమాన్‌చాలీసా పారాయణ, పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, నాగమారుతీ వైదిక క్రతువు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త ములుకుట్ల విశ్వనాథశర్మ సుందరకాండ పారాయణ చేశారు. లక్ష హనుమాన్ చాలీసా కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈవో శ్రీనివాసరెడ్డి, అనురాధ, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, లీలాప్రసాద్ పాల్గొన్నారు.



చెస్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందస్తున్న చిత్రకారుడు జయశేఖర్, ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్ సాయికృష్ణ, లలిత, తదితరులు

చెస్ విజేతలకు బహుమతులు

తెనాలి, మారీసుపేట జూన్ 8: స్థానిక అమరావతి ఫ్లాట్స్ లోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం విద్యారుకథలకు చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులు మోక్షిత్‌రామ్ చౌదరి, ఎబినేజర్, రిక్కిలకు ప్రముఖ చిత్రకారుడు జయశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్‌లు నాగవరపు సాయికృష్ణ మాట్లాడుతూ 25 రోజులగా వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖనం, చేతిరాత, చదరంగంలో శిక్షణ అందజేశామన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఇష్టాలను గమనించి వారిని వారిని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో లలిత, చదరంగం కోచ్ జీ.పృథ్వి, చిత్రలేఖనం, చేతిరాత కోచ్ శివచరణ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కూటమికి తరగని ఆదరణ

తెనాలి అర్బన్, జూన్ 8 : తెనాలి అసెంబ్లీ ఎన్నికల్లో రూరల్ మండలంతోపాటు కొల్లిపర మండలంలో కూటమికి మంచి ఆదరణ లభించింది. గ్రామాల వారీగా ప్రధానపార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు, మెజారిటీ ఇలా ఉన్నాయి. అసెంబ్లీతో పోలిస్తే పార్లమెంట్ సెగ్మెంట్‌లో కొద్దిగా క్రాస్ ఓటింగ్ ఉంది.

గ్రామం	కూటమి	వైసీపీ	మెజారిటీ
హాఫ్‌పేట	639	721	82
ఖాజీపేట	1551	58	1493
కొలకలూరు	5242	2820	2422
ఎరుకలపూడి	583	135	448
నందివెలుగు	3725	1277	2448
కంచర్లపాలెం	737	519	218
సోమసుందరపాలెం	1029	330	699
కఠెవరం	2974	1986	988
గుడివాడ	1210	948	262
కోపల్లె	534	706	172
సంగం జాగర్లమూడి	3077	1832	1245
అంగలకుదురు	3726	1413	2313
చావావారిపాలెం	369	433	64
మల్లెపాడు	613	734	121
తేలప్రోలు	1235	1184	51
నేలపాడు	393	341	52
పెదరావూరు	2158	1832	326
జగ్గడిగుంటపాలెం	2589	926	1663
బుర్రిపాలెం	1706	766	940
జెముడుబాడు	577	345	232
దావులూరు	1244	649	595
శివలూరు	531	662	131
సిరిపురం	366	332	34
అత్తోట	2993	847	2146
కుంచవరం	460	240	220
దంతలూరు	382	408	26
అత్తలూరివారిపాలెం	188	67	121
వల్లభాపురం	1877	2402	525
మున్నంగి	2081	2238	157
పిడపర్రు	366	507	141
పిడపర్తిపాలెం	319	279	40
కొల్లిపర	3493	4717	1224
దావులూరిపాలెం	772	524	248
తుములూరు	1814	1711	103
హనుమాన్‌పాలెం	547	104	443
బొమ్మువానిపాలెం	290	290	0
అన్నవరం	609	551	58
అన్నవరపులంక	370	379	9

ధూళిపాళ్ళకు అభినందనల వెల్లువ



నరేంద్ర కుమార్‌ను సత్కరిస్తున్న మహిళా ఉద్యోగులు

పొన్నూరుటౌన్,జూన్8: పొన్నూరు శాసనసభ్యుడిగా అఖండ మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని చింతలపూడి గ్రామం వద్దగల నరేంద్ర స్వగృహం ఉదయం నుంచే కోలాహలంగా మారుతుంది. ఎన్నికల ఫలితాలు వెలువడి నాలుగు రోజులు దాటినప్పటికి నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లావ్యాప్తంగా నరేంద్ర కుమార్ అభిమానులు పెద్ద ఎత్తున ఆయన ఇంటికి తరలి వస్తుండటంతో చింతలపూడి వీధులు సందడిగా మారువుతున్నాయి. శనివారం పొన్నూరు పట్టణ, మండటానికి చెందిన పలువురు మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నరేంద్ర కుమార్‌ను దుశ్శాలువాలతో సత్కరించటమే కాకుండా అభినందనలు తెలియజేసారు. అలాగే ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పొన్నూరుశాఖ అధ్యక్షుడు ఎంఎం ఖుద్దూస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నరేంద్ర కుమార్‌ను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పొన్నూరు పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం నాయకులు, వండ్ల వర్తక సంఘాల నాయకులు, తదితరులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, జనసేన నాయకులు, సంగం డెయిరీ ఉద్యోగులు నరేంద్ర కుమార్ గృహానికి తరలివచ్చి పుష్పగుచ్చాలు అందచేసి శుభాకాంక్షలు తెలియజేసారు.



నరేంద్ర కుమార్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ కార్యాకర్తలు



నరేంద్ర కుమార్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

11న సీ హెచ్ సాంబయ్య

స్మారక అవార్డు ప్రదానం

గుంటూరు(తూర్పు), జూన్8: గుంటూరు జిల్లా, తెనాలి రూరల్ మండలం, ఖాజీపేటకు చెందిన సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న అవార్డు ప్రదానోత్సవం ఈ నెల 11న గుంటూరు నగరం, బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని, అన్నమయ్య కళా వేదికపై జరగనున్నట్టు పరిషత్ అధ్యక్షుడు చిటుమడుగుల భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యాప్రదాత సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డును తిరుపతి, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ దేవరు భారతికి ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. అంతేగాక ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధికంగా 599/600 మార్కులు సాధించిన విద్యార్థిని ఆకుల వెంకట నాగసాయి మనస్వినికి రూ.10 వేల ప్రోత్సాహక నగదుతో ప్రతిభా పురస్కారం అందజేయనున్నట్టు వివరించారు. ఇదేవేదికపై విజయవాడకు చెందిన నాట్యమయూరి లేఖ్యాభరణీ బృందంచే నృత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

మునిపల్లె సొసైటీ అధ్యక్షుడి రాజీనామా

పొన్నూరుటౌన్, జూన్8: మునిపల్లె వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్ష పదవికి వైసీపీ నేత కోట శ్రీనివాసరావు శనివారం రాజీనామా చేసారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవటంతో తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. తనకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసారు.

మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్

శివనాగేశ్వరరావు హఠాన్మరణం



శివనాగేశ్వరరావు (ఫైల్)

తెనాలి (మారీసుపేట), జూన్ 8: స్థానిక పురపాలక సంఘంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఎఫ్1 సీటు విధులు నిర్వహిస్తున్న వై. శివనాగేశ్వరరావు గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్యారీస్ మునిపల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతివ్యక్తం చేశారు. ఐతానగర్‌లోని ఆయన స్వగృహంలో శివనాగేశ్వరరావు మృతదేహాన్ని పలువురు ఉద్యోగులు, యూనియన్ నేతలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఆదివారం అంత్యక్రియలు ఉంటాయని కుటుంబసభ్యులు తెలిపారు.

నేడు ఆంథోని చర్చి 34వ వార్షికోత్సవం

● దివ్యబలి పూజ సందేశమివ్వనున్న బిషప్ భాగ్యయ్య

గుంటూరు, జూన్ 8 : గుంటూరు నగరంపాలెంలోని పునీత ఆంథోని వారి చర్చి 34వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు విచారణ గురువు రెవరెండ్‌ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మహోత్సవ వేడుకల గురించి వివరించారు. ఫాదర్ జ్యోతిరాజు మాట్లాడుతూ శక్తివంతుడైన అద్భుతాల అంతోని వారిని భక్తితో ప్రార్థిస్తే దేవుని దీవెనలు పొందుతారు అన్నారు. ప్రధానంగా అనారోగ్యంతో ఉన్నవారు స్వస్థత పొందుతారన్నారు. ఉద్యోగం, సంతానం పొందుతారు అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటలకు చర్చిలో ప్రత్యేక దివ్య పూజ జరుగుతుందన్నారు. ఈ పూజకు బిషప్ రెవరెండ్ చిన్నాబత్తిని భాగ్యయ్య ముఖ్యఅతిథిగా హాజరై పూజ సందేశం ఇస్తారన్నారు. అదేవిధంగా వందమందికి పైగా కన్యస్త్రీలు, మరో వంద మందికి పైగా గురువులు హాజరవుతారన్నారు. ఈ పూజకు వివిధ జిల్లా నుంచి ఐదు వేల మందికి పైగా భక్తులు హాజరుకానున్నట్లు ఫాదర్ జ్యోతిరాజు తెలిపారు. ఇందుకుగాను అన్ని ఏర్పాట్లు చేశామని ఫాదర్ జ్యోతిరాజు తెలిపారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఆంథోని వారి దీవెనలు పొందాలని ఆకాంక్షించారు.

వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



వీరాంజనేయ స్వామికి మొక్కు తీర్చుకుంటున్న నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు

పొన్నూరుటౌన్, జూన్8: పొన్నూరు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ జ్యోతిర్మయి దంపతులు పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వీరాంజనేయ స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన నరేంద్ర కుమార్ దంపతులకు అర్చక స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నాగవల్లీదళార్చనలు నిర్వహించి వడమాల పూజలు చేసారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు స్వామి వారి శేష వస్త్రాలను అందచేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు ఆపాలని ఆదేశాలు

గుంటూరు సిటీ, జూన్ 8 : జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతులకు బ్రేక్ పడింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొలువు తీరిన తర్వాత ప్రమోషన్‌ల వ్యవహారంలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో జిల్లాలోని 164 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్ల ఆశలపై నీళ్లు పడ్డాయి. వాస్తవానికి వారిని అగ్రికల్చర్ అసిస్టెంట్ నుంచి వ్యవసాయ విస్తరణ అధికారులుగా నియమించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. అందుకు అనుగుణంగా జాబితా తయారు చేసిన జిల్లా వ్యవసాయ అధికారులు రాష్ట్ర అధికారుల అనుమతికోసం వేచిచూస్తుండగా ఎన్నికలకోడ్ అమల్లోకివచ్చింది. ప్రభుత్వం మారటంతో ప్రమోషన్‌ల వ్యవహారంలో బ్రేక్ పడింది.

పవర్‌లిఫ్టింగ్‌లో విద్యార్థినికి బంగారు పతకం

గుంటూరు(విద్య), జూన్ 8 : స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ(జీసికెవిఎన్)డిగ్రీ కళాశాల విద్యార్థిని పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతనెల 29న పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని టి నాగలక్ష్మీ(బికాం ద్వితీయ సంవత్సరం) పాల్గొని 76 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈనెల 16 నుంచి పంజాబ్‌లోని పటియాలలో జరిగే జూనియర్ నేషనల్ పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు.

20న అరుణాచలాపిరి ఆర్టీసీ బస్సులు

గుంటూరు, జూన్ 8: పౌర్ణమి సందర్భంగా ఈనెల 22న అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 20న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 22వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదేరోజు రాత్రి అక్కడే బసచేసి 22న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 23వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జీ రూ.2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి డాన్స్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూన్ 8: ఆంధ్రప్రదేశ్ డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు వేంకటేశ్వర విజ్ఞానమందిరంలో జరిగిన రాష్ట్ర స్థాయి డాన్స్ పోటీలు ముగిసాయి. పోటీలలో పలు జిల్లాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు పాల్గొన్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు యేమినేని కళ్యాణ్ తెలిపారు.

కూటమి గెలుపుతో మొక్కులు తీర్చుకున్న ప్రజలు



సీతారామస్వామి దేవస్థానంలో మొక్కులు తీర్చుతున్న టీడీపీ నేతలు

తెనాలి, మారీసుపేట జూన్ 8: సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధించడంతో ఆయా పార్టీల శ్రేణులు మొక్కులను తీర్చుకున్నారు. స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీసీతారామస్వామి వారి దేవస్థానంలో శనివారం టీడీపీ వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ ఆధ్వర్యంలో స్వామివారి మొక్కు 111 కొబ్బరికాయలను కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఎంపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్‌లు అఖండ విజయం సాధించాలని, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఎన్నికలకు ముందు తాము దేవునికి మొక్కామని, తమ కోర్కెలు తీరడంతో నేడు మొక్కు చెల్లించామని తెలిపారు. కార్యక్రమంలో వల్లూరి నరసింహరావు, డాక్టర్ వేమపరి శేషగిరిరావు, ఈదర శ్రీనివాసరావు, కె ఉపేంద్ర, ఆలపాటి కిరణ్, మునిపల్లి దుర్గాప్రసాద్, గుమ్మడి ప్రసాద్, రాంబాబు, శివరామరాజు పాల్గొన్నారు.

బుర్రిపాలెం నుంచి .. పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లు అఖండ విజయం సాధించడంతో మండల పరిధిలోని బుర్రిపాలెం గ్రామంనుండి టీడీపీ పార్టీ మాజీప్రెసిడెంట్ పెమ్మసాని జయప్రకాశ్‌నారాయణ ఆధ్వర్యంలో బుర్రిపాలెం గ్రామ టీడీపీ నేతలు మొక్కులు చెల్లించారు. ముందుగా గ్రామం నుండి పార్టీశేణులతో కలసి పాదయాత్రగా వైకుంఠపురం చేరుకొని శ్రీలక్ష్మి పద్మావతి వెంకటేశ్వరస్వామి వార్లను దర్శించి, తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ ప్రెసిడెంటు పెమ్మసాని శ్రీనివాసరావు, పరుచూరి రాంబాబు, కిలారి వినోద్, శాఖమూరి రమేష్, శైలేష్, పి మల్లికార్జున బ్రదర్స్, ముక్కామల శ్రీధర్, రేవతి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



బుర్రిపాలెం నుండి పాదయాత్రగా వస్తున్న టీడీపీ, జనసేన నేతలు



గతంలో రామోజీరావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న నరేంద్ర కుమార్

దార్శనికుడు రామోజీరావు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ● పలువురి నేతల నివాళులు

పొన్నూరుటౌన్,జూన్8: సామాన్యుడిని తట్టిలేపే అక్షరానికి సైతం సామాజిక బాధ్యత ఉందని ఈనాడు దినపత్రిక ద్వారా నిరూపించిన దార్శనికుడు రామోజీరావు అని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, మీడియా మొఘల్ రామోజీరావు హైదరాబాదులోని రామోజి ఫిలిమ్ సిటిలో ఉంచిన రామోజీరావు పార్థివ దేహాన్ని నరేంద్రకుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామోజీరావుతో తన అనుబంధం మరువలేనిదన్నారు. మీడియా రంగంపై అయన వేసిన ముద్ర చెరపలేనిదని, కళారంగానికి అయన ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. వ్యాపార రంగంలో అయన సాగించిన ప్రయాణం సాటిలేనిదన్నారు. వార్తపత్రిక, మీడియా ద్వారా సమాజంలోని రుగ్మతులను ప్రభుత్వాలకు తెలిపి ప్రజల పక్షాన నిలిచిన అక్షర యోధుడు రామోజీరావు అని కీర్తించారు. ఆయన మృతి తెలుగు జాతికి తీరనిలోటుగా పేర్కొన్నారు.

తెనాలిరూరల్: మండల పరిధిలోని అంగకుదురు గ్రామంలో శనివారం గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి అధ్వర్యంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద రామోజీరావు చిత్రపటానికి నివాళి అర్పించారు.

తెనాలి, మారీసుపేట : స్థానిక కొత్తపేటలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పార్టీ శ్రేణులతో కలసి రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ తన కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెదకాకాని : రామోజీరావు మృతి పట్ల టీడీపీ మండల నేతలు సంతాపం తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రామోజీరావు పార్థివ దేహాన్ని సందర్శిస్తున్న నాదెండ్ల మనోహర్

రామోజీరావు అస్తమయం బాధాకరం

● తెనాలి నూతన ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, జూన్ 8: మీడియా రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుని అక్షరయోదుడిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్న రామోజీరావు అస్తమయం బాధాకరమని జనసేన పీఏసీ ఛైర్మన్, కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్లమనోహర్ అన్నారు. శనివారం మృతి చెందిన ఈనాడు సంస్థల ఛైర్మన్ పద్మభూషణ్ రామోజీరావు పార్థివ దేహాన్ని మనోహర్ సందర్శించి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామోజీరావు అస్తమయం.. అన్న వార్త తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. తాను నమ్మిన విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా పక్షం వహిస్తూ మీడియా ప్రపంచంలో రారాజుగా ఆయన చేసిన ప్రయానం అసామాన్యమైనదని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మనోహర్ తెలిపారు.

తెనాలి అర్బన్: ఈనాడు సంస్థల అధినేత సీహెచ్.రామోజీరావు మృతి పట్ల పలు సంఘాలు, సంస్థలు, నాయకులు శనివారం సంతాపం తెలిపారు. కవిరాజా పార్కులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, ముత్తేవి రవీంద్రనాథ్, మొవ్వా సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

ఇద్దరు మహిళలకు గాయాలు

తెనాలి, మారీసుపేట జూన్ 8: పట్టణంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మహిళలు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. శనివారం త్రీటౌన్ ఎస్సై వెంకటేశ్వరావు తెలిపిన వివరముల ప్రకారం చెంచుపేటకు చెందిన ధనలక్ష్మి పనుల నిమిత్తం ఐతానగర్‌కు వెల్లుతున్న సందర్భంలో ప్రమాదానికి గురైందని తెలిపారు. తన స్కూటీపై ఐతానగర్ వెల్లుటకు ఆలపాటి వంతేన నుండి రైల్వేస్టేషన్ వంతెన వైపు వెలుతుండగా ముందు వెలుతున్న ఏపి 39 ఎన్‌టి 2322 ఇన్నోవా కారును నడుపుతున్న వ్యక్తి అకస్మాత్తుగా కారు ఆపి డోరు తెరవగా వెనక నుండి వస్తున్న ధనలక్ష్మి డోరు తగిలి కిందపడగా చేతికి, తలకు, కాలుకు గాయమవగా అమెను జిల్లా వైద్యశాలకు తరిలించి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ వందెన వద్ద.. మార్కెట్ వంతెన వద్ద శనివారం రోడ్డు దాటుతున్న జంపని గ్రామానికి చెందిన మమత అనే మహిళను ఏపి 07 డిఆర్ 9078 అనే ద్విచక్ర వాహనదారుడు ఢీ కొనగా ఆమె కాలుకు గాయమైందని తెలిపారు. ఆమెను ప్రైవేట్ వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్టు పోలీసులు తెలపారు. ఆమెకు ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారన్నారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశ్వరావు తెలిపారు.

జీవో 117ను రద్దు చేయాలి

గుంటూరు(విద్య), జూన్ 8 : విద్యాశాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగజేస్తున్న జీవో నెంబర్117ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.